సాక్షి అనకాపల్లి

శనివారం, 30, నవంబర్, 2024



చెన్నై విద్యార్థుల సందడి

బీచ్‌రోడ్డు: చెన్నైకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం విశాఖలోని బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు.



గౌరీశ్వరస్వామి రథోత్సవం

చోడవరంలోని స్వయంభూ గౌరీశ్వరస్వామి రథోత్సవం పట్టణ పురవీధుల్లో ఘనంగా 8లో జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల నాలుగు రోజులు వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం చెప్పారు. ఈనెల 30న 3 మి.మీ, డిసెంబర్ 1న 3, 2న 4, 3న 2, 4న 1 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉష్ణోగ్రతలు 29.2 నుంచి 31 డిగ్రీలు నమోదవుతాయని, గాలి గంటకు 6 నుంచి 8 కి.మీ. వేగంతో వీస్తుందని ఆమె చెప్పారు.

న్యూస్‌రీల్

ఆరు ఇసుక డిపోలకు 43 దరఖాస్తులు

- అత్యధికంగా అనకాపల్లికి 11
- అత్యల్పంగా మాడుగులకు 2

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ఆరు ప్రైవేట్ ఇసుక డిపోలకు 43 దరఖాస్తులు వచ్చినట్లు మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు తెలిపారు. టెండర్ల దరఖాస్తు ప్రక్రియ ముగియడంతో శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఇసుక అందరికీ అందుబాటులో ఉండాలనే ఆకాంక్షతో ప్రభుత్వం అనకాపల్లి జిల్లాలో ఆరు ప్రైవేట్ ఇసుక డిపోల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించిందన్నారు. గడువు శుక్రవారంతో ముగిసిందని, ఆరు డిపోలకు మొత్తం 73 దరఖాస్తులు అమ్ముడుపోగా అందులో కేవలం 43 దరఖాస్తులే తమ వద్ద దాఖలయ్యాయని శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో అత్యధికంగా అనకాపల్లి ఇసుక డిపోకు 11 దరఖాస్తులు, నక్కపల్లి డిపోకు 10, అచ్యుతాపురం డిపోకు 9, నర్సీపట్నం డిపోకు 8, చోడవరం డిపోకు 3, మాడుగుల డిపోకు 2 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

5 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

మహారాణిపేట(విశాఖ): సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. వచ్చేనెల 5 నుంచి 14వ తేదీ వరకు సాగు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. డిసెంబర్ 2న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. 5వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి ఆ రోజు నుంచే నామినేషన్లు స్వీకరిస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 316 సాగునీటి సంఘాలు ఉన్నాయి. విశాఖ జిల్లాలో 29 సాగునీటి సంఘాలు, అనకాపల్లి జిల్లాలో 259 సాగునీటి సంఘాలు,ఏఎస్సార్ జిల్లాలోని పాడేరు, అరకు నియోజకవరాల పరిధిలో 28 సాగునీటి సంఘాలు ఉన్నాయి.

7న మెగా పేరెంట్స్ మీట్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

నక్కపల్లి: డిసెంబరు నెల 7వ తేదీన ప్రతి పాఠశాలలో మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు కోరారు. శుక్రవారం నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో పేరెంట్స్ సమావేశాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఇటీవల నిర్వహించిన ఫార్మెటివ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను వారి తల్లిదండ్రులకు అందజేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు కుంచం నరేష్, నూకరాజు, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, రాణి లలిత, మూర్తిరాజు, సీహెచ్ సత్యనారాయణ, నారాయణరావు, రమేష్‌బాబు, ఆచార్యులు, సీఆర్పీలు గంగేశ్వరరావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

అరకు రైలుకు అదనపు కోచ్‌లు



తాటిచెట్లపాలెం (విశాఖ): అరకు రైలుకు ప్రయాణికులరద్దీ దృష్ట్యా ఆయా తేదీల్లో అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు1, 3వ తేదీల్లో 1-విస్టాడోమ్ కోచ్, డిసెంబర్ 2,4వ తేదీలలో 1-థర్డ్ ఏసీ ఎకానమి కోచ్, తిరుగుప్రయాణంలో కిరండూల్ -విశాఖ(08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 2,4వ తేదీల్లో 1-విస్టాడోమ్, డిసెంబరు 3,5వ తేదీల్లో 1-థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌లను జతచేస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా శాంతి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా బి.శాంతి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ ఎస్టేట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన లక్ష్మారెడ్డిని ప్రభుత్వం కొద్ది రోజుల క్రితమే బదిలీ చేసింది. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ స్థానంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డిప్యూటీ కలెక్టర్ శాంతిని నియమించారు. అలాగే వుడా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ)గా బి.దయానిధి నియమితులయ్యారు.

రెల్ల రాల్చె.. కన్నీరు మిగిల్చె..



నేలరాలిన వరి వెన్నులను సేకరిస్తున్న రైతు

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట మట్టి పాలు కావడంతో రైతు కంట నీరు చిందింది. పెట్టుబడి సొమ్ము వచ్చే పరిస్థితి లేకపోవడంతో కుంగిపోయే దుస్థితి నెలకొంది. రెల్ల రాల్చు పురుగు వరి పంటను ధ్వంసం చేసింది. జిల్లాలో ఈ తరహా పురుగు ఉధృతి ఇదే మొదటిసారి కావడంతో అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. వ్యవసాయాధికారులు సకాలంలో గుర్తించి **హెచ్చరించి ఉంటే నష్టం తగ్గేదని ఆవేదన చెందుతున్నారు.**



దేవరాపల్లిలో రెల్ల రాల్చు పురుగు నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు, (ఇన్‌సెట్) వరి పంటకు వ్యాపించిన రెల్ల రాల్చు పురుగులు

అన్నదాతకు అపార నష్టం

- వరి పంటపై రెల్ల రాల్చు పురుగు ఉధృతి
- నేలపాలవుతున్న ధాన్యం గింజలు
- ఎకరానికి సగం మేర పంట నష్టం
- 5 మండలాల్లో రెల్ల రాల్చు సమస్య అధికం
- జిల్లాలో ఈ తరహా పురుగు ఉధృతి ఇదే ప్రథమం
- చేతికి అందివచ్చిన పంట నేలపాలు కావడంతో రైతన్న ఆందోళన
- వ్యవసాయాధికారులు సకాలంలో గుర్తించి ఉంటే నష్టం తగ్గేదని ఆవేదన
- జిల్లాలో 56,410 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు

దేవరాపల్లి:

జిల్లాలో ఖరీఫ్ వరి పంటపై రెల్ల రాల్చు పురుగు వ్యాపించి అన్నదాతకు అపార నష్టాన్ని మిగిల్చింది. వరి పంట చేతికందే సమయంలో రెల్ల రాల్చు పురుగు అన్నదాత పాలిట శాపంగా మారింది. ఖరీఫ్ పంటను పూర్తిగా నేలపాలు చేసి రైతుల కంట కన్నీరు పెట్టించింది. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు కూటమి ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందించకపోవడంతో అన్నదాతలు అప్పులు చేసి సాగు చేపట్టారు. కొంతమేర ఖరీఫ్ వరి ఆశాజనకంగా ఉందని ఆశపడ్డ అన్నదాతకు చివరికి నిరాశే మిగిలింది. జిల్లాలో ఈ ఏడాది 56,410 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు చేశారు. వీటిలో 7,200 హెక్టార్లకు పైగా వరి కోతలు ఇప్పటికే పూర్తయ్యాయి. పంట కోసి కల్లాలకు చేర్చే సమయంలో గతంలో లేని విధంగా మాయదారి రెల్ల రాల్చు పురుగు పంటపై దాడి చేసింది. వరి వెన్నులను కొరికేయడంతో పాలం మట్టిలో కలిసిపోతున్న దయనీయ పరిస్థితి నెలకొంది. కోత దశలో ఉన్న వరి పంటతోపాటు కోసిన పొలంలో సైతం కనుచూపు మేర నేల రాలిన వరి వెన్నులు, ధాన్యపు గింజలు కనిపిస్తున్నాయి. కొందరు రైతులు వాటిని సేకరించే ప్రయత్నం చేసినా వెన్ను విరిగిపోతుండటంతో గింజలు మట్టిలో కలిసిపోతున్నాయి. ఇలాంటి దుస్థితి గతంలో ఎన్నడూ లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట కళ్ల ఎదుటే మట్టిలో కలిసిపోతుండటంతో అన్నదాత దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం, వ్యవసాయాధికారులు సకాలంలో ఈ పురుగుల దాడిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టి ఉంటే ఇంత నష్టం వాటిల్లేది కాదని కొందరు రైతులు వాపోతున్నారు.

జిల్లాలో ఈ పురుగు ఉధృతి ఇదే ప్రథమం

జిల్లాలో పంట కోత సమయంలో ఇలా పురుగు దాడి చేయడం ఇదే ప్రథమమని పలువురు రైతులతో పాటు వ్యవసాయాధికారులు సైతం చెబుతున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో వర్షాలు కురవకపోవడంతోనే మెట్ట ప్రాంతాల్లో

ఈ పురుగు ఉధృతంగా వ్యాప్తి చెందినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో దేవరాపల్లి, రావికమతం, రోలుగుంట, సబ్బవరం, చీడికాడ తదితర మండలాల్లో ఈ పురుగు ప్రభావం అధికంగా ఉంది. మిగతా మండలాల్లో సైతం ఈ సమస్య రైతులను వేధిస్తోంది. దీంతో ఎకరాకు రెండు బస్తాల మేర ధాన్యం నష్టం జరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతుండగా, రైతులు మాత్రం సగానికి సగం నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఎకరాకు 25 నుంచి 30 బస్తాలు (80 కేజీలు) ధాన్యం దిగుబడి రావాల్సి ఉండగా రెల్ల రాల్చు పురుగు ఉధృతితో కనీసం 10 నుంచి 12 బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదని పలువురు రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రెల్ల రాల్చు పురుగు వ్యాప్తి ఇలా....

రెల్ల రాల్చు పురుగు ప్రభావం మెట్ట ప్రాంత వరి పొలాలపై అధికంగా ఉంటుంది. పగటి పూట ఈ పురుగు వరి దుబ్బు లోపలి భాగంలోను, మట్టి పగుళ్ల మధ్యలో ఉండి రాత్రి పూట బయటకు వస్తుంది. ఇలా బయటకు వచ్చి వరి వెన్నులను కత్తిరించిన మాదిరిగా చేసి పంటకు నష్టం చేకూర్చుతుంది.



పురుగు ఉధృతితో పొలంలో నేలరాలిన వరి వెన్నులు

ఇవీ నివారణ చర్యలు....

ఉధృతంగా ఉన్న రెల్ల రాల్చు పురుగు నివారణకు **గింజ గట్టి పడిన దశలో** ఎకరా పంటకు **పర్మెత్రిన్ 400 మిల్లీలీటర్ల** మందును పిచికారీ **చేయాలని వ్యవసాయాధికారులు** సూచిస్తున్నారు. **గింజ కొంచెం పచ్చిగా ఉంటే ఎకరా పంటకు బైఫెంత్రిన్ 500** మిల్లీలీటర్ల **మందును పిచికారీ చేసుకో**వడం ద్వారా పురుగు వ్యాప్తిని నివారించవచ్చునన్నారు.

కన్నీరే మిగిలింది..



సుమారు రూ.30 వేలు పెట్టుబడి పెట్టి ఎకరం వరి సాగు చేశాను. ఈ ఏడాది పంట బాగా పండిందని ఆశపడ్డాను. కోత సమయంలో ఏదో పురుగు పట్టి వరి వెన్నులను కొరికేస్తుంది. సగం మేర ధాన్యం గింజలు పొలం మట్టిలోనే కలిసిపోయాయి. నేల రాలిన వరి వెన్నులను తీయడానికి ప్రయత్నిస్తే విరిగిపోయి గింజలు రాలిపోతున్నాయి. దీంతో ఎకరాకు 8 బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. చేతికి అందివచ్చిన పంట నేలపాలు కావడం చూసి కంట నీరు వచ్చింది.

–గొర్లి దేముడు, రైతు, దేవరాపల్లి

గతంలో ఎన్నడూ లేదు



పంట కోత సమయంలో ఇలా పురుగులు దాడి చేసి పంట నాశనం చేయడం గతంలో ఎన్నడూ లేదు. ఎకరం 60 సెంట్ల విస్తీర్ణంలో ఆర్‌జీఎల్, 1075 రకం వరి పంటను సాగు చేశాను. రెల్ల రాల్చు పురుగు దాడి చేయడంతో సగానికి పైగా పంట పొలం మట్టిలోనే కలిసి పోవడం చూసి గుండె తరుక్కుపోతుంది. వరి చేను కుప్పలు పెడుతుంటే ఉత్త గడ్డి మాత్రమే ఉంది. కనీసం తినడానికి ధాన్యం సరిపోయే పరిస్థితి లేదు. ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలి.

–గుల్లిపల్లి అప్పలనాయుడు, రైతు, దేవరాపల్లి

క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన



జిల్లాలోని పలు మండలాల్లో రెల్ల రాల్చు పురుగు ఉధృతి అధికంగా ఉంది. ఈ పురుగు ప్రభావంతో ఎకరాకు 2 బస్తాలకు పైగా ధాన్యం నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ పురుగు ఉధృతి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని రకాల మందులు పిచికారి చేయడం ద్వారా పురుగును నివారించవచ్చు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

స్థాయీ సంఘంలో 113 అంశాలు ఆమోదం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 117 అంశాలను పొందుపరిచారని, అందులో 4 అంశాలు వాయిదా వేయగా..మిగిలిన 113 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం, పలు అభివృద్ధి పనులకు, రెవెన్యూ అంశాలకు సంబంధించి కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు, ఉద్యోగుల సర్వీసులకు సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు.

నిరాశ్రయ షెల్టర్ పరిశీలించిన తర్వాతే..

జీవీఎంసీకి చెందిన ఏయూటీడీ ఎన్‌జీవోచే నిర్వహిస్తున్న మూడు నైట్ షెల్టర్లు (టీఎస్సార్ పురుషులు, టీఎస్సార్ స్త్రీలు, భీమనగర్ షెల్టర్) నిర్వహణ కాల పరిమితి (1-5-2024 నుంచి 30-4-2025 వరకు) పొడిగించే అంశం స్థాయి సంఘం ఆమోదానికి వచ్చింది. ఇందుకు సంబంధించి ఓఅండ్ఎం ఖర్చు రూ.25.92 లక్షలు మంజూరు చేసే అంశంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నైట్ షెల్టర్లలో ఎంతమంది నిరాశ్రయులు ఉంటున్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నడుస్తుంటే ఎందుకు జీవీఎంసీ బోర్డు ఏర్పాటు చేయలేదు? ఒకే వ్యక్తి ఎందుకు నడపాలి? ఓపెన్ ఆంక్షన్ ద్వారా మరొకరికి అవకాశం ఇవ్వొచ్చు కదా? ఇలా పలు ప్రశ్నలు యూసీడీ అధికారిపై కురిపించారు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని వాయిదా వేశారు. నైట్ షెల్టర్లను విజిట్ చేస్తామని, ఆ తరువాతే ఈ అంశాన్ని చర్చిద్దామని సభ్యులు స్పష్టం చేశారు.

ఆ ఇద్దరి కోసమే...

స్థాయీ సంఘ సమావేశాలు ఆ ఇద్దరి కోసమే నిర్వహిస్తున్నట్టుందని సభ్యులు చెవులు కొరుక్కొంటున్నారు. ఆ ఇద్దరిలో ఓ కార్పొరేటర్‌కు ఏకంగా సుమారుగా రూ.5 కోట్ల పనులు, మరో కార్పొరేటర్‌కు రూ.2 కోట్ల పైబడి పనులు ఆమోదానికి వచ్చాయి. అయితే మా పరిస్థితి ఏంటని మిగతా సభ్యులు రుసరుసలాడారు. సమావేశంలో జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీఆర్ ఎస్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, జోన్-1, 3, 4 జోనల్ కమిషనర్లు ప్రేమ ప్రసన్న వాణి, కె శివ ప్రసాద్, మల్లయ్యనాయుడు, యూసీడీ పీడీ పీఎం సత్యవేణి, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీధర్, శేఖర్, శాంతిరాజ్, చిరంజీవి, మురళీకృష్ణ, ఏఎమ్‌ఓహెచ్‌లు ప్రసాదరావు, అప్పలనాయుడు, డాక్టర్ ఎన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి

అనంతుని దీపోత్సవానికి సర్వం సిద్ధం



గిరిపై కొలువుదీరనున్న అనంతుని పెద్ద ఉత్సవ విగ్రహాలు

పద్మనాభం : పద్మనాభంలో శనివారం సాయంత్రం జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి ఆలయ అధికారులు సిద్ధం చేశారు. విజయనగరం నుంచి సింహాచలం వెళ్లే బస్సులు, వాహనాలను విజయనగరం వై జంక్షన్, రాజాపు లోవ, తగరపువలస, ఆనందపురం, నీల కుండీలు జంక్షన్ మీదుగా సింహాలచలం మళ్లించనున్నారు. సింహాచలం నుంచి విజయనగరం వెళ్లే బస్సులు, వాహనాలను నీలకుండీలు, ఆనందపురం, తగరపువలస, రాజాపులోవ మీదుగా మళ్లిస్తారు. చిన్నాపురం, రెడ్డిపల్లి గ్రామం వైపు నుంచి దీపోత్సవానికి వచ్చే బస్సులను అర్చకునిపాలెం వద్ద నుంచి తిరిగి వెనక్కి పంపిస్తారు. నీల కుండీలు, మద్ది జంక్షన్ వైపు నుంచి వచ్చే బస్సులను గోస్తని బిడ్జి సమీపంలోఉన్న పెట్రోల్ బంక్ నుంచి వెనక్కి పంపిస్తారు. తగరపువలస, రేవిడి వైపు నుంచి వచ్చే బస్సులను కృష్ణాపురం క్వారీ నుంచి వెనక్కి పంపిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఈ నిబంధనలు అమలు చేస్తారు.



కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

పార్కింగ్...

చిన్నాపురం, రెడ్డిపల్లి మీదుగా వచ్చే ఆటోలు, ద్విచక్ర వాహనాలకు పద్మనాభం జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద గల మామిడి తోటలోను, ఎమ్మార్ కళాశాల వద్ద తగరపువలస, రేవిడి మీదుగా వచ్చే వాహనాలకు సివిల్ సప్‌లై గొడౌన్, క్యాంప్ డెవిడ్, కస్తూర్బా స్కూళ్లు, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఖాళీ స్థలాల్లో పార్కింగ్ చేయాలి. నీలకుండీలు జంక్షన్, బోని, మద్ది మీదుగా వచ్చే వాహనాలకు జామిరవి ఇటుక బట్టీలు, పద్మనాభం గోస్తని వంతెన కింద ఖాళీ స్థలంలో పార్క్ చేయాలి.

58 పశువైద్య శిబిరాల ఏర్పాటు.. ఈ ఏడాది లక్ష్యం

- జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాదరావు

నాతవరం: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ ఏడాది 58 పశువైద్య శిబిరాల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నామని పశుగణాభివృద్ధి శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాదరావు అన్నారు. జిల్లేడుపూడి గ్రామంలో శుక్రవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 210 పశువులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లాలం రమణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఈవో ప్రసాదరావు మాట్లాడుతూ పాడి పశువుల్లో లోపాలను గుర్తించి, దానిని నివారించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇంతవరకు ఉమ్మడి జిల్లాలో 34 మెగా వైద్య శిబిరాలు నిర్వహించామని, మిగతా శిబిరాలు వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఒక శిబిరం నిర్వహణకు ప్రభుత్వం రూ.20 వేలు ఖర్చు చేస్తుందన్నారు. ఉచితంగా మందులు, మినరల్ మిక్సర్ పాడి రైతులకు అందిస్తామన్నారు. ఈ ఏడాది లేగదూడల ప్రదర్శనలు 35పైగా నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. ఇంతవరకు ఆరు ప్రాంతాల్లో లేగదూడల ప్రదర్శనలు నిర్వహించి, పాడి రైతులకు ప్రోత్సాహాలు అందిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 13,632 ఆవు పెయ్యలు జన్మించే ఇంజక్షన్లు రాయితీపై అందించనున్నామన్నారు. ఈ ఇంజక్షన్ చేసిన పశువులకు కచ్చితంగా ఆడ పెయ్యి జన్మిస్తుందన్నారు. ఒక వేళ ఆడ పేయ్య జన్మించకపోతే రైతు చెల్లించిన డబ్బులు వెనక్కి చెల్లిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం 13,972 ఇంజక్షన్లు సిద్ధం చేసిందన్నారు. ఇంతవరకు జిల్లాలో 10 వేలకు పైగా ఇంజక్షన్లు చేశామన్నారు. పశుసంవర్ధకశాఖ డీడీ చంద్రశేఖర్, నర్సీపట్నం ఏడీ రాంబాబు, గోపాలమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, పశువైద్యాధికారులు నూకేశ్వరరావు, సుప్రియ, గోపాలమిత్రులు రైతులు పాల్గొన్నారు.



జిల్లేడుపూడిలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాదరావు

జీవీఎంసీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు అందజేస్తున్న మేయర్ హరివెంకట కుమారి

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీలో 30 మందికి కారుణ్య నియామకాలు జరిగాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శుక్రవారం తన చాంబర్లో నియామకపత్రాలు అందజేశారు. జీవీఎంసీలో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు 30 మందికి నియామక ఉత్తర్వులు అందజేసినట్టు మేయర్ తెలిపారు. వీరిలో ఒకరు వర్క్ ఇన్‌స్పెక్టర్ కాగా, 10 మంది కార్యాలయ సబార్డినేటర్లు, ముగ్గురు పీహెచ్ మేస్త్రులు, నలుగురు పీహెచ్ వర్కర్లు, 12 మంది మజ్దూర్లు ఉన్నారు. ఈ 30 మంది సంబంధిత విభాగాల్లో వెంటనే విధుల్లో చేరాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

104 రోడ్డు ప్రమాదాలు.. 103 మరణాలు



- ఈ ఏడాది నమోదైన కేసులివి..
- హెల్మెట్ పెట్టుకోకుంటే కఠిన చర్యలు
- ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరిక

అనకాపల్లి: రహదారి ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ద్విచక్రవాహన ప్రమాదాల కేసులు ఈ ఏడాది ఇంతవరకు 103 నమోదు చేయగా, 104మంది మృత్యువాత పడ్డారని, 35మంది క్షతగాత్రులు అయ్యారన్నారు. చాలా కేసుల్లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వలన మరణాలు సంభవిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే మొదటిసారి జరిమానా విధిస్తామని, రెండోసారి 3 నెలలపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వారు, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్లో ప్రయాణించిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ చలానాలు మూడు కంటే ఎక్కువ ఉన్న వాహనాలు సీజ్ చేసి, చలానాలు కట్టిన తరువాత వాహనాన్ని వెనక్కు ఇస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా స్కూళ్లు, కళాశాలల్లో రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని, ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, సురక్షితంగా ప్రయాణించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- అనకాపల్లి డీఎస్పీ శ్రావణి
- తాటిపర్తి పోలీసు చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ



తాటిపర్తి పోలీసు చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

మాడుగుల రూరల్: ఏజెన్సీ నుంచి అక్రమంగా గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి కోరారు. మండలంలో తాటిపర్తి పోలీసు చెక్‌పోస్టును శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి వాహన తనిఖీల విషయంలో సలహాలు, సూచనలు ఇచ్చారు. అనుమానం ఉన్న ప్రతి వాహనంను విధిగా తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం మాడుగుల పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.నారాయణరావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు శ్రావణి ఎంపిక



శ్రావణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిహెచ్.భువన మాధురి

దేవరాపల్లి: జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు దేవరాపల్లి మండలం బేతపూడి కేజీబీవీ విద్యార్థిని కురమాన శ్రావణి అర్హత సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా నందికొట్కూరు నవనందిని హైస్కూల్ గ్రౌండ్‌లో 'ఏపీ 27వ సబ్ జూనియర్ సెపక్‌తక్రా చాంపియన్ షిప్–2024' పేరిట బాల, బాలికలకు ఈ నెల 26, 27 తేదీలలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని శ్రావణి సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ సిహెచ్.భువన మాధురి తెలిపారు. త్వరలో జరిగే జాతీయ పోటీలలో విద్యార్థిని పాల్గొంటుందని చెప్పారు. శ్రావణిని ప్రిన్సిపాల్ భువన మాధురి, ఉపాధ్యాయులు, సిబ్బంది శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

2 నుంచి శ్రీనృసింహ దీక్షలు

సింహాచలం: ఈ ఏడాది శ్రీనృసింహ దీక్షలకు దేవస్థానం అధికారులు తిథులను అనుసరించి తేదీలను ప్రకటించారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి 41 రోజుల మండల దీక్ష, డిసెంబర్ 12వ తేదీ నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభవుతుంది. ఆయా రోజుల్లో దీక్షాధారులకు సింహగిరిపై దేవస్థానం వైదికులు ఉదయం 7 గంటలకు మాలధారణ చేస్తారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షధారులంతా దీక్ష విరమించాల్సి ఉంటుందని ఈవో త్రినాథరావు తెలిపారు.

2 నుంచి మార్గశిర మాసోత్సవాలు

- ఉదయం 8.40 గంటలకు తొలి పూజ
- ఉత్సవ ఏర్పాట్లను వివరించిన ఈవో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో శోభారాణి, అధికారులు

డాబాగార్డెన్స్(విశాఖ): ఉత్తరాంధ్ర వాసుల కల్పవల్లి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు డిసెంబర్ 2 నుంచి 30 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. 2వ తేదీ ఉదయం 8.40 గంటలకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ తొలి పూజ చేసి ఉత్సవాలు ప్రారంభిస్తారని తెలిపారు. మార్గశిర మాసంలో వచ్చే గురువారాల్లో(5, 12, 19, 26) అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 5వ తేదీ అర్ధరాత్రి 12.01 గంటలకు తొలి గురువారం మొదటి పూజ, పంచామృతాభిషేక సేవ చేసి దర్శనాలు ప్రారంభిస్తామన్నారు. కనకమహాలక్ష్మికి గురువారం ప్రీతి పాత్రం కావడంతో ఆ రోజున ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 22న చతుర్వేద సభ, అర్చక సదస్సు, 23న నాదస్వర కచేరీ, 26న సహస్ర ఘటాభిషేకం, మహాన్నదానం ఉంటుందన్నారు. 28న మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి బురుజుపేటలో కొలువై ఉన్న కనకమహాలక్ష్మి ఆలయం వరకు రథయాత్ర నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ 3 వేల మందికి, గురువారాల్లో 50 వేల మంది వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా ప్రత్యేకంగా క్యూలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దేవస్థానం తరఫున ప్రధాన రహదారి నుంచి అమ్మవారి ఆలయం వరకు రెండు లైన్లు ఉంటాయని, ప్రధాన రహదారిపై పోలీసుల సూచన మేరకు మరిన్ని క్యూలు ఏర్పాటు చేస్తామన్నారు.కలెక్టర్ సూచనల మేరకు పెండాళ్లు వేస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ 2 వేల మందికి, 26న నిర్వహించే మహాన్నదానం రోజున 20 వేల మంది భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథ స్వామి ఆలయం వద్ద మహాన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం

మున్సిపల్ స్టేడియం, విక్టోరియా ఆస్పత్రి, కొత్తరోడ్డు ఆర్చి గేటు వద్ద పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. నగర శివార్ల నుంచి వచ్చే భక్తుల కోసం ఉచిత బస్సులు నడిపేందుకు దాతలు సాయం చేస్తున్నారని వెల్లడించారు. ఆనందపురం, మధురవాడ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారన్నారు.

క్యూలు ఇలా..

ధర్మదర్శనం ఉచితంగా చేసుకోవచ్చని, రూ.500తో విశిష్ట దర్శనం, రూ.200తో ప్రత్యేక దర్శనం, రూ.100తో శీఘ్ర దర్శనం ఉంటుందన్నారు. రీడింగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో టికెట్లు పొందవచ్చన్నారు. గురువారం రోజున నిర్వహించే పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.7,500, సాధారణ రోజుల్లో రూ.2,500 టికెట్‌గా నిర్ణయించామని, ఒక టికెట్‌పై దంపతులు, ఇద్దరు చిన్న పిల్లలు పాల్గొనవచ్చన్నారు. ఉదయం 5 నుంచి 6, 11.30 నుంచి 12 గంటల మధ్య ఈ సేవ ఉంటుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు పరామర్శ



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను పరామర్శిస్తున్న డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత సన్యాసిపాత్రుడు, పార్టీ నాయకులు

నర్సీపట్నం: హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రోబోటిక్ హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయించుకుని ఇటీవల ఇంటికి చేరుకున్నారు. దీంతో ఆయనను డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసిపాత్రుడు దంపతులు, పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు కర్రి శ్రీనివాసరావు, కర్రి రాంగోపాల్, తమరాన శ్రీనివాసరావు, నర్సీపట్నం పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల విజేత ఏఎంఏఎల్ కళాశాల



విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఏయూ అంతర్ కళాశాలల ఖోఖో పోటీల విజేతగా అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల నిలిచింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా ఈ పోటీలు జరిగాయి. 28 కళాశాలలకు చెందిన 16 జట్లు విజయం కోసం హోరాహోరీగా తలపడగా.. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. శుక్రవారంజరిగిన ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇదే స్ఫూర్తితో ఏయూ ఖోఖో జట్టు జాతీయస్థాయిలో రాణించాలని క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మాకవరపాలెం: పేకాట శిబిరంపై స్పెషల్ బ్రాంచి పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. మండలంలోని గిడుతూరు సమీపంలోని ఓ మామిడితోటలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం స్పెషల్ బ్రాంచి పోలీసులు ఒక్కసారిగా దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడున్న 11 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, రూ.69,270 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేశామని, వాహనాలను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

కనుల పండువగా గౌరీశ్వరస్వామి రథోత్సవం



చోడవరం వీధుల్లో సాగుతున్న స్వయంభూ గౌరీశ్వరస్వామి రథోత్సవం



లక్ష కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు

చోడవరం: స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం కనుల పండువగా సాగింది. వందలాది మంది భక్తుల మధ్య స్వామివారి ఊరేగింపు చోడవరం పట్టణ పురవీధుల్లో ఘనంగా జరిగింది. ఆలయంలో కార్తీక మాసోత్సవాలు నెల రోజులుగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా మాసశివరాత్రి సందర్భంగా స్వామివారి తిరువీధి రథోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గౌరీశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం రథోత్సవాన్ని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ప్రారంభించారు. శివాలయం వీధి, మెయిన్ రోడ్డు, కొత్తూరు జంక్షన్, స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ మీదుగా రథోత్సవం సాగింది. వందలాది మంది భక్తులు హర హర మహాదేవ అంటూ శివ నామ స్మరణ చేశారు. అంతకు ముందు ఆలయంలో గౌరీశ్వరస్వామికి లక్ష పత్రి పూజ, గౌరీదేవి అమ్మవారికి అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు రుద్ర హోమం చేశారు. గౌరీపరమేశ్వరులకు శాంతి కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వి.వి.సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ గూనూరు సురేష్, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జీవన శైలిలో మార్పులు అవసరం



ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన పుస్తకాలను ప్రదర్శిస్తున్న వైద్యులు

మునగపాక: ప్రస్తుతం ప్రజలు జీవన శైలిలో మార్పులు అవసరమని, అప్పుడే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని ఆయుర్వేద వైద్యుడు అలుగోలు ప్రసాదరావు అన్నారు. మునగపాక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో నిర్వహించిన నిరంతర ఔషధ విజ్ఞాన సదస్సు శుక్రవారంతో ముగిసింది. పరంపర్య వైద్య మహా సంఘం, తిరుపతి గురూజీ మూలికా వైద్య సమాఖ్య సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి జీవన విధానం వల్లనే అనేక కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయన్నారు. ప్రజలంతా తమ ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. ఇతర వైద్యంతో తగ్గని అనేక వ్యాధులు మూలికా వైద్యంతో నయం చేయవచ్చన్నారు. కరోనా తరువాత ప్రజల్లో ఆయుర్వేద వైద్యంపై నమ్మకం పెరిగిందన్నారు. కోడూరు ఆశ్రమ ఆయుర్వేద వైద్యుడు సుందరరాజ్ పెరుమాళ్ల మాట్లాడుతూ వాత, పిత్త, కఫ వ్యాధుల నివారణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పరంపర్య వైద్య మహా సంఘం ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కోశాధికారి అల్లక రాజు, ఈసీ మెంబర్లు సంధ్యారాణి, శ్రీనివాస్, తిరుపతి ప్రసాద్, ఝాన్సీ లక్ష్మి, డాక్టర్ అగస్త్య, సజ్జన రమేష్, ఆరూరి బాలనర్సయ్య, డాక్టర్ లావణ్య, మారుతి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్

- రూ.5 లక్షల విలువైన ఆరు బైకుల స్వాధీనం
- జల్సాలకు అలవాటు పడి చోరీలు



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో నిందితులు

యలమంచిలి రూరల్: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గుర్ని యలమంచిలి పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు యలమంచిలి సీఐ ఎస్.ధనుంజయరావు శుక్రవారం సాయంత్రం మీడియా సమావేశంలో తెలిపారు. యలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏపీ31 ఈక్యూ 8213 నంబరుతో ఉన్న బజాజ్ పల్సర్ చోరీ కేసుకు సంబంధించి నమోదైన కేసును దర్యాప్తు చేసిన పోలీసులకు ధర్మవరం వీధికి చెందిన కొటారు భాను(19), వెదుళ్ల సుబ్రహ్మణ్యం(19), రెల్లి వీధికి చెందిన భూపతి శివనాగు(22) నిందితులుగా గుర్తించారు. వారి వద్ద నుంచి పాయకరావుపేట పీఎస్‌లో యమహా ఎఫ్‌జెడ్(ఏపీ35పీ0856), నక్కపల్లి పీఎస్ పరిధిలో బజాజ్ పల్సర్(ఏపీ39ఈవై 8793), ఎస్.రాయవరం పీఎస్ పరిధిలో హీరో హోండా స్ప్లెండర్, హోండా యాక్టివా, తుని పీఎస్ పరిధిలో బజాజ్ పల్సర్(ఏపీ05ఈవీ5783) వివిధ చోరీ కేసులకు సంబంధించిన ఆరు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పాత నేరస్థులుగా సీఐ చెప్పారు. ముగ్గురూ ఓ బృందంగా ఏర్పడి జిల్లాతో పాటు పక్క జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు నిందితులు చోరీ చేసిన బైక్‌లను ఓ రహస్య ప్రదేశంలో కొంత కాలం దాచి, వారికి డబ్బు అవసరమైనప్పుడు ఒక్కొక్క బైక్‌ను విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకుల విలువ సుమారుగా రూ.5 లక్షలు ఉంటుంది. నిందితుల్లో కొటారు భాను, వెదుళ్ల సుబ్రహ్మణ్యంపై యలమంచిలి పట్టణ, రూరల్, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, కశింకోట పోలీస్ స్టేషన్లలో పలు క్రిమినల్ కేసులున్నాయి. నిందితులను శుక్రవారం పట్టణానికి సమీపంలో కొత్తఎర్రవరం పొలిమేరమ్మ గుడి దగ్గరలో రాష్ట్ర జాతీయ రహదారిపై అరెస్ట్ చేశారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులను సీఐ ఈ సందర్భంగా అభినందించారు. పట్టణ ఎస్ఐ కె.సావిత్రి, ఏఎస్ఐ చెల్లారావు, సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ హాకీ పోటీలకు ఏయూ జట్టు ఎంపిక



సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి హాకీ గ్రౌండ్‌లో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక శుక్రవారం జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీ తరఫున పురుషుల హాకీ జట్టును ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహించారు. ఎంపికైన టీం వచ్చే నెల 3 నుంచి 8వ తేదీ వరకు చెన్నైలోని ఎంఆర్‌కే స్టేడియంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ మెన్ టోర్నమెంట్‌లో పాల్గొంటుంది. స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య, ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఎస్.విజయమోహన్, వర్సిటీ ప్రధాన కార్యాలయం ఫిజికల్ ఆధికారి డాక్టర్ పల్లవి, జిల్లా విశ్రాంత స్పోర్ట్స్ అధికారి ఎస్.సూర్యారావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్కపల్లిలో జరిగిన పోటీల్లో ప్రతిభకనపరిచిన వారిని చెన్నైలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, తాతాజీ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

12 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్.రాయవరం పోలీసులు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు తిమ్మాపురం మీదుగా గంజాయి తరలిస్తున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు శుక్రవారం తెలిపారు. ఒడిశా నుంచి కడపకు ఈ గంజాయిని తరలించేందుకు ప్రయత్నిస్తునట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు అడ్డురోడ్డు వద్ద తనిఖీలు చేసి పట్టుకున్నారు. గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

టేకు చెట్ల నరికివేతపై కేసు నమోదు చేయాలి



దాచిన టేకు కలపను అటవీ అధికారులకు చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నాతవరం: గాంధీనగరం గ్రామ సమీపంలోని అటవీ యూకలిప్టస్ తోటలో అనధికారికరంగా టేకు చెట్లు నరికి, తరలించిన వారిపై కేసు నమోదు చేయాలని గ్రామ సర్పంచ్ పాతాళ అప్పారావు డిమాండ్ చేశారు. గ్రామ సమీపంలో అటవీ శాఖకు చెందిన 40 ఎకరాలు విస్తీర్ణంలో వన సంరక్షణ సమితి సభ్యులు 2001లో యూకలిప్టస్ మొక్కలు నాటారన్నారు. ఇటీవల ప్రభుత్వం ఆ చెట్లు నరికివేతకు వేలం ద్వారా టెండర్లు పిలిచిందన్నారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు కొంత కాలంగా చెట్లు నరికి కలప రవాణా చేస్తున్నారన్నారు. తోట మధ్యలో ఉన్న టేకు చెట్లపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కన్నుపడిందని ఆయన ఆరోపించారు. అంతే గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లతో కలప అక్రమ రవాణా జరిగిపోయిందని సర్పంచ్ అప్పారావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తిబాబు, గ్రామపెద్దలు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా శుక్రవారం అటవీ శాఖ సెక్షన్ అధికారి చిరంజీవి, ఇతర సిబ్బందికి అక్రమంగా నరికిన భారీ టేకు చెట్టు మొదలను స్వయంగా చూపించారు. ఈ విషయంపై అటవీ శాఖ సెక్షన్ అధికారి చిరంజీవి మాట్లాడుతూ టేకు చెట్టు నరికిన వారిపై కచ్చితంగా కేసు నమోదు చేస్తామన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



కేడీపేట పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: కేడీపేట పోలీస్‌స్టేషన్ పరిధి భీమవరం చెక్‌పోస్ట్ వద్ద 25 కేజీల గంజాయితో పాటు రూ.11.06 లక్షల నగదుతో పట్టుబడిన కర్ణాటకకు చెందిన ఇద్దరి వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో రూ.12.50 లక్షల నగదును తీసుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి కొనుగోలుకు వెళ్లారు. అక్కడ రూ.1.25 లక్షల విలువ గల గంజాయిని కొనుగోలు చేసి, మిగిలిన నగదును కారులో పెట్టుకుని, రొంపుల ఘాట్ నుంచి అయితే చెకింగ్ ఉంటుందని భావించి, కేడీపేట మీదుగా వచ్చారు. రాజమండ్రి వెళ్లే సమయంలో కేడీ పేట భీమవరం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడినట్టు ఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామన్నారు. నిందితులను పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు.

ఏయూలో కొత్త కోర్సు

- ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సు నిర్వహణకు ఏర్పాట్లు



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న రిజిస్ట్రార్, పక్కన వీసీ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నూతనంగా ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సును ప్రారంభిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఏయూతో అవాంటెల్ లిమిటెడ్ శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు, అవాంటెల్ వైస్ ప్రెసిడెంట్(టెక్నికల్) ఎన్. శ్రీనివాసరావు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ కోర్సులో 18 మందికి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు రెండో సంవత్సరంలో రూ.25 వేలు స్టైఫండ్ అందిస్తామన్నారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు రూ.9 లక్షల వార్షిక వేతనంతో అవాంటెల్ సంస్థ ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకొచ్చిందన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీటెక్– వీఎల్ఎస్ఐ కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలతో అనుసంధానం చేస్తూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నూతన కోర్సులను రూపకల్పన చేస్తున్నట్లు వెల్లడించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు అనువైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అవాంటెల్ అడ్వైజర్ డాక్టర్ నాగరాజన్ మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ అభ్యసనానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులపై కేసు

- ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ
- 20 మంది మైనర్ డ్రైవర్లకు జరిమానా



మైనర్లతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి: వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి లైసెన్స్ కలిగి ఉండాలని, మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులకు శుక్రవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. 20 మంది వాహనదారులకు రూ.535 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై మైనర్లు దురుసుగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు. వాహనాలు నడిపే వ్యక్తులు తప్పనిసరిగా వాహన రికార్డులు తమ వెంట తీసుకుని రావాలన్నారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ డి.శేఖరం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘంటసాల జయంతి అధికారికంగా నిర్వహించాలి

అనకాపల్లి: డిసెంబర్ 4న ప్రముఖ సినీ గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు 102వ జయంతి అని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తెలిపారు. ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఒక ప్రకటనలో కోరారు.

ప్రకృతి పరిరక్షణ్ యాప్‌తో ఉపయోగాలు



యాప్ గురించి వివరిస్తున్న ఆయుర్వేద విభాగం వైద్యురాలు లావణ్య

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రకృతి పరిరక్షణ్ యాప్‌ను ఆయుష్ విభాగంలో కొత్తగా ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరూ ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుర్వేద విభాగం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. శుక్రవారం ఆయుర్వేద ఆస్పత్రిలో రోగులకు యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు. యాప్‌లో రోగుల వివరాలు నమోదు చేసుకోవడం వల్ల సకాలంలో మందులు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి యోగా శిక్షకురాలు ఆవుపాటి చంద్రిక, రోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో వరి రైతులు

కశింకోట: మండలంలోని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రం స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో పాటు తుపాను ప్రభావంతో ఆకాశం ఉదయం నుంచి పూర్తిగా మేఘావృతమై ఉండటం, గాలులు వీయడంతో రైతులు దిగులు చెందారు. ఇప్పటికే పంట వెన్ను దశకు చేరి కొంత వరకు పండింది. ఇక చేతికి అంది రానుంది. ఈ నేపథ్యంలో వర్షంతో పాటు గాలులు వీయడం వల్ల చేను కింద పడిపోయి నష్టం కలగనుందని రైతులు ఆవేదన చెందున్నారు. పంట చివరి దశలో దెబ్బ తింటే తీవ్రంగా నష్టపోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు.

10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి: తుమ్మపాలలోని వెంకుపాలెం వెళ్లే రహదారిలో గల పాన్‌షాప్‌లో 10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని షాప్ యజమాని సూరిబాబుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. తుమ్మపాలలో పాన్‌షాప్‌లు తనిఖీ చేస్తుండగా వీటిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 3,595 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,360
మొదటి రకం	3,280	3,880
రెండో రకం	2,820	3,680
మూడోరకం	2,700	3,110

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 22 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 4 యూనిట్లు, బి పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబి పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు..

అన్నదాతలకు తుపాను వర్రీ

- రైతులను అప్రమత్తం చేసిన అధికారులు
- వరి పంటను రక్షించుకునే పనిలో కర్షకుల పాట్లు



తుపానుపై వరి రైతులను అప్రమత్తం చేస్తున్న వ్యవసాయ అధికారి రంగాచారి



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

వాతావరణ కేంద్రం సూచనలతో ప్రభుత్వ యంత్రాంగం రైతులను అప్రమత్తం చేయడంతో కోతకొచ్చిన వరికి బ్రేకులు పడ్డాయి. ఈ నెల 29, 30 తేదీల్లో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా తుపాను ఉందని, నియోజకవర్గంపై కూడా దాని ప్రభావం ఉందని వార్తలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ రైతుల పరిస్థితి దినదినగండంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఫెంగల్ తుపానుగా మారింది. దీని ప్రభావంతో రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి.

తుమ్మపాల: వాతావరణంలో మార్పులు జరగడంతో ఖరీఫ్ రైతుల్లో గుబులు పట్టుకుంది. ఈ ఏడాది తొలకరి ప్రారంభం నుంచి అతివృష్టి.. అనావృష్టి కారణంగా ఖరీఫ్ పంట సాగు కోసం రైతులు పడిన కష్టాలు వర్ణనాతీతం. ఇప్పుడు పంట కోతకు వచ్చే దశలో తుపాను హెచ్చరికలతో అష్టకష్టాలు పడుతున్నారు.

కోతలకు బ్రేకు..

నియోజకవర్గంలోని అనకాపల్లి, కశింకోట మండలాల్లో దాదాపు 13 వేల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు జరిగింది. అనకాపల్లి మండలంలో 6,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటికే పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం, వెంకిపాలెం, సీతానగరం వంటి గ్రామాల్లో పంట పక్వానికి రావడంతో రైతులు కోత కోసి కుప్పలు చేసుకున్నారు. అనకాపల్లి మండలవ్యాప్తంగా 240 హెక్టార్ల కోతలు పూర్తవగా, కశింకోట మండలంలో 220 హెక్టార్ల కోతలు జరిగాయి. ఈ తరుణంలో తుపాను రావడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పశుగ్రాసం కోసం కూలీలతో కోత కోయించిన రైతులు ఆదరా బాదరా పంటను కుప్పలుగా చేసుకుంటున్నారు. తుపాను దెబ్బ తగిలితే పంట నష్టపోయి అప్పుల పాలవుతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీలైనంత త్వరగా పంటలను కోత కోయించేందుకు సిద్ధపడుతున్న సమయంలో తుపాను ప్రభావంతో వరి కోతలకు బ్రేకులు పడ్డాయి. వాతావరణం అనుకూలిస్తే మరో 20 రోజుల్లో వరికోతలు పూర్తయ్యే అవకాశం ఉంది.

కుప్పలుగా వరి..

పొలాల్లో కోసి పనలపై ఉన్న వరి పంటను రక్షించుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. కోత కోసి పొలాల్లో పనలపై ఉన్న పంటను రక్షిత ప్రాంతానికి తరలించి కుప్పలు వేస్తున్నారు. భయంతో కుప్పలకు చీరలు కట్టి గాలికి కొట్టుకుపోకుండా భద్రపరుచుకుంటున్నారు. గ్రామాల్లో 60 శాతం వరి చేలు కోత దశకు చేరుకున్నాయి. తుపాను ప్రభావంతో రైతులు పంట కోయడానికి సాహసించడం లేదు. తుపాను నేపథ్యంలో వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.



గాలికి ఎగిరిపోకుండా చీరలు చుట్టి భద్రపరుచుకున్న వరి కుప్పలు

కోత కోసి పనలుగా ఉన్న వరి చేను

కోతలు ఆపుకొన్నాం..



రెండు రోజులుగా వాతావరణం చల్లగా మారి తుపాను ప్రభావం కనిపించడంతో వరి కోతలు వాయిదా వేసుకున్నాం. కాని రెల్ల రాల్చు తెగులు వరిని ఆశించడంతో వరి ఎన్నులకు కోత పడుతోంది. త్వరగా కోత కోసి పంటను కాపాడుకోవాలని చూస్తున్న సమయంలో తుపాను సమస్య చుట్టుముట్టింది. తుపాను ప్రభావం తక్కువగా ఉండటంతో నేటి నుంచి వాతావరణం మారుతుందని చూస్తున్నాం.

– ముమ్మన అప్పారావు, రైతు, రేబాక గ్రామం

తుపాను ప్రభావం ఉండకపోవచ్చు..



తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులకు క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కల్పించాం. గ్రామాల్లో వ్యవసాయ అసిస్టెంట్లు, ఫీల్డ్ అధికారులు కూడా వరి రైతులకు కోతలు కోయవద్దని సూచించారు. కోసిన వరిని వెంటనే కుప్పలు పెట్టించాం. మండలంలో రైతులందరినీ అప్రమత్తం చేశాం. తుపాను ప్రభావం మండలంలో లేకపోవడంతో రైతులు ధైర్యంగా ఉన్నారు.

– పి.రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి

భోగలింగేశ్వరస్వామి ఆలయంలో శాంతి కల్యాణం



శివలింగానికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు



పూజలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కోటవీధి శ్రీ భోగలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం మాస శివరాత్రి చతుర్దశిని పురస్కరించుకుని శివలింగానికి లక్ష బిల్వార్చన మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్వామివారికి హోమం, శాంతి కల్యాణం చేపట్టారు. అధిక సంఖ్యల భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కేఎస్ఎఫ్ సత్యనారాయణ, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద మహా ధర్నా



మెయిన్‌రోడ్డులో ప్రచారం నిర్వహిస్తున్న మాణిక్యాలరావు

అనకాపల్లి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునే బాధ్యత ఉత్తరాంధ్ర ప్రజలపై ఉందని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని దుకాణాల్లో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ప్లాంట్ పరిరక్షణకు డిసెంబర్ 1న బీఎస్పీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయనున్నట్లు తెలిపారు. నేటి పాలకులు ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని అనుకోవడం అన్యాయమన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో ప్రభుత్వాలు విఫలమైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వనమాల నాగభూషణం, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



సమావేశానికి హాజరైన కల్లుగీత కార్మిక సంఘాల నాయకులు

కశింకోట: మద్యం దుకాణాల కేటాయింపులో గీత కార్మికుల కోటాను 20 శాతానికి పెంచి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రా దేముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లపాలెంలో శుక్రవారం నిర్వహించిన మండల కల్లు గీత కార్మికుల సంఘాల సమావేశంలో నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనీసం మండలానికి ఒకటి వంతున మద్యం దుకాణాన్ని గీత కార్మికుల కోటాలో కేటాయించాలన్నారు. గీత కార్మికులకు సంక్షేమ నిధి ఏర్పాటు, పథకాల అమలు చేయాలన్నారు. ప్రమాదలలో మృతి చెందిన గీత కార్మికుల కుటుంబానికి ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.పది లక్షలు పరిహారాన్ని నెల రోజుల్లోగా చెల్లించాలన్నారు. బీమా అమలు చేయాలని, ప్రభుత్వమే ప్రీమియం కూడా చెల్లించాలన్నారు. గీత వృత్తి చేసుకునే కార్మికులకు సంఘ సభ్యత్వం, గుర్తింపు కార్డులివ్వాలన్నారు. కశింకోట, బయ్యవరం, వెదురుపర్తి, నరసింగబిల్లి గీత కార్మిక సంఘాల అధ్యక్షులు కట్టా ఈశ్వరరావు, పొలుసు మహాలక్ష్మి నాయుడు, దమ్ము జాన్, తుట్టా అప్పారావులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం ప్రతినిధులు చప్పిడి ఆంజనేయులు, పిల్లి అప్పారావు, దుంగ సత్యనారాయణ, మునషా మోహన్, పిల్లి సతీష్, బండా బాబూరావు, నాగలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జూదం ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు

అనకాపల్లి: జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల నుంచి రూ.2,430 నగదును శుక్రవారం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ టి.వి. విజయకుమార్ మాట్లాడుతూ స్థానిక గవరపాలెం, దిబ్బవీధి, కొబ్బరితోటలో జూదం ఆడుతున్నట్లు తెలుసుకుని దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో అదే ప్రాంతానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అన్నదాతలకు 'ఫెంగల్' బెంగ

- కోతల వేళ మారిన వాతావరణం
- తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన



కె.కోటపాడులో వరి పంటను ఎడ్లబండిపై తరలిస్తున్న రైతులు

కె.కోటపాడు : వాతావరణంలో మార్పులు అన్నదాతలను భయపెడుతున్నాయి. కోతదశకు వచ్చిన పంట చేతికందకుండా పోతుందేమోనన్న గుబులు వారిని వెంటాడుతోంది. ఫెంగల్ తుపాను హెచ్చరికలతో పంటను రక్షించుకునేందుకు పరుగులు తీస్తున్నారు. పలు పల్లపు ప్రాంత గ్రామాలైన రొంగలినాయుడుపాలెం, గొండుపాలెం, మల్లంపాలెం, మేడిచర్ల, ఎ.భీమవరం, పొడుగుపాలెం, గుల్లేపల్లి, వి.సంతపాలెం, కె.కోటపాడుతో పాటు పలు గ్రామాల్లో కోతలు కోసి మడుల్లో పంటను ఆరబెట్టారు. తుపాను హెచ్చరికలతో పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది.

రోలుగుంట: తుపాను హెచ్చరికలతో మండల రైతులు పంట సంరక్షణకు చర్యలు చేపట్టారు. కోసిన పంటను మోపులు కట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించి, కుప్పలు పెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. గురు, శుక్రవారాల్లో కోతలు జరపలేదు.

మాడుగుల రూరల్/మాడుగుల: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చిరుజల్లులు పడ్డాయి. దీంతో భయాందోళనకు గురైన రైతులు కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో పడ్డారు. మండలంలో 90 శాతం వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. ఈదురు గాలులు వల్ల కొన్ని చోట్ల వరి పంట నేల కొరిగింది.మరో పక్క రెల్ల రాల్చే పురుగు కారణంగా వరి పంట దెబ్బ తింది.

బుచ్చెయ్యపేట: వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత దశకు చేరిన వరి చేను నేలవాలిపోకుండా చర్యలు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో నూర్పుడు యంత్రాలతో నూర్చి ధాన్యం గింజలను ఇంటి తరలించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా వరి పంటను కోయవద్దని, కోసిన పంటను చిన్నచిన్న కుప్పలుగా పెట్టి భద్రపరుచుకోవాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్,మండల వ్యవసాయాధికారి భాస్కరరావులు రైతులకు సూచించారు.

15 నాటికి అభివృద్ధి పనులు పూర్తి



గొండుపాలెంలో డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల ఇంజినీర్ సుమతి

కె.కోటపాడు : మండలంలో రూ.6.29 కోట్ల ఉపాధి నిధులతో చేపట్టిన 51 పనులను వచ్చేనెల 15 నాటికల్లా పూర్తి చేయనున్నట్లు మండల ఇంజినీర్ పి.సుమతి తెలిపారు. గొండుపాలెంలో జరుగుతున్న డ్రైనేజీ పనులతో పాటు చౌడువాడలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. 51 పనుల్లో ఇప్పటికే 27 పనులు పూర్తి కాగా మరో 24 పనులు జరుగుతున్నట్లు ఆమె అన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.1.12 కోట్ల బిల్లుల చెల్లించినట్లు చెప్పారు. మండలంలో జరుగుతున్న పనులు డిసెంబర్ 15 నాటికల్లా పూర్తి అయ్యేలా చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులను నిర్మాణదారులు చేయాలని సూచించారు. గొండుపాలెం సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, బండారు లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీనివాసరావు, మాజీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ పాల్గొన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



శివ లింగానికి రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు



రుద్రాభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు



బిల్వ దళాలు, నూతన వస్త్రాలతో అలంకరించిన శివలింగం

కశింకోట: స్థానిక పురాతన శివాలయం (సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం)లో శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా మాస శివరాత్రిని పురస్కరించుకుని మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా భక్తుల సహకారంతో రుద్రాభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, బిల్వ దళాలు, విభూతి వగైరా ద్రవ్యాలతో 1008 కొబ్బరి కాయలతో శివ లింగానికి వేద మంత్రోచ్ఛరణల నడుమ ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు ఆద్యంతం భక్తి పారవశ్యంతో తిలకించారు. అభిషేకం అనంతరం బిల్వ దళాలు, నూతన వస్త్రాలతో స్వామి వారిని అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ చేశారు. అలాగే రాత్రి దీపార్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని దీపారాధన చేశారు. శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది.

స్కూల్ పిల్లల బస్సులు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



ఉత్తమ డ్రైవర్లకు బహుమతులు అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ

అనకాపల్లి: మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, పట్టణ పరిధిలో వాహనాలు నడిపే సమయంలో వాహనాల వేగం తగ్గించాలని ట్రాఫిక్ సీఐ ఎం. వెంకట నారాయణ అన్నారు. స్థానిక గాంధీనగరం సాయిశక్తి స్కూల్ ఆవరణలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వివిధ ప్రాంతాల్లో పాఠశాలలకు చిన్నారులను తీసుకెళ్లే సమయంలో ప్రత్యేక దృష్టి సారించాలని, చిన్నారులు బస్‌లు ఎక్కి, దిగే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్లీనర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మానవ తప్పిదాల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఈ ఏడాది ఉత్తమ డ్రైవర్లకు సీఐ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సిటీ బస్‌పాస్‌లు పట్టణం వరకూ అనుమతించాలి



ఆర్టీసీ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

అనకాపల్లి: పట్టణం జీవీఎంసీలో విలీనమై సుమారు 15 సంవత్సరాలు కావస్తున్నా సిటీ బస్‌పాస్‌లను అనకాపల్లి పట్టణం వరకూ అనుమతించకపోవడం అన్యాయమని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ అన్నారు. స్థానిక ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో ఏవోకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ సిటీ జనరల్ బస్‌పాస్‌లు లంకెలపాలెం వరకూ అనుమతించడం తగదన్నారు. అనకాపల్లి పట్టణం నుంచి విశాఖకు నిత్యం వేలాది మంది వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో దివ్యాంగులకు రాయితీ కల్పించాలని, విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా వివిధ దూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాల్తేర్ డిపో బస్‌లు పట్టణ పరిధిలో ప్రయాణికులు కోరిన చోట ఆపడం లేదని, వివిధ ప్రభుత్వ ఉద్యోగులు విధులు ముగించుకుని స్వగృహాలకు వెళ్లే సమయంలో వాల్తేర్ డిపో బస్‌లు ఆపాలనే డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డు సోమరాజు, గోవిందరాజు, ముగడ అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు పాల్గొన్నారు.

రెల్ల రాల్చు పురుగు ఉధృతి తగ్గించుకోవాలి



తుమ్మపాలలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రమణమూర్తి

అనకాపల్లి: వరి పంటపై రెల్ల రాల్చు పురుగు ఉధృతి ఉంటుందని, దీని నివారణకు క్లోరిపైర్పాస్ 2 మిల్లీలీటర్లు చొప్పున లీటర్ నీటిలో పిచికారీ చేయాలని ఆర్ఏఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రమణమూర్తి అన్నారు. మండలంలో తుమ్మపాల గ్రామంలో వరి పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎస్సీపేట్ లీటర్ నీటికి 205 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలని, అదే విధంగా పిప్రోనిల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటితో పిచికారీ చేయాలన్నారు. కొండంపూడి శాస్త్రవేత్త డాక్టర్ రాజుకుమార్ రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వరి కోతలు కోసి పనలు మీద ఉన్న వరిని కుప్పలు వేసుకోవాలని తెలిపారు. ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ మాట్లాడుతూ వరి తర్వాత రెండో పంటగా వేసుకోవడానికి మినుములు, పెసల విత్తనాలు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, కొంతమంది రైతులు జనుము వేస్తారని, వ్యవసాయ పరిశోధనా స్థానంలో విత్తనాలు ఉందుబాటులో ఉన్నాయని, కేజీకి రూ.100 చెల్లించి తీసుకోవాలని తెలిపారు. వరి కోసే ముందు రైతులు తేమను ఉపయోగించుకుని ఎకరాకు 12 కేజీల చొప్పున విత్తనాలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు



పోలీసుల ఆధ్వర్యంలో చెట్ల కొమ్మలు, తుప్పలు తొలగిస్తున్న స్థానికులు

కశింకోట: మండలంలోని పలు గ్రామాల నుంచి జాతీయ రహదారికి చేరేటప్పుడు వాహన చోదకులు ప్రమాదాలకు గురి కాకుండా సీఐ అల్లు స్వామినాయుడు శుక్రవారం చర్యలు చేపట్టారు. గ్రామాల నుంచి వచ్చే రోడ్లు కలిసేటప్పుడు మార్గ మధ్యంలో తుప్పలు, చెట్ల కొమ్మలు వగైరా అడ్డు ఉండటం వల్ల జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు కానక ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో వీటి నివారణకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తేగాడ, జమాదులపాలెం, పరవాడపాలెం, గొబ్బూరు గ్రామాల నుంచి వచ్చే రోడ్లలో రెండు వైపులా ఉన్న చెట్లు, చిన్న మొక్కలు నరికి తొలగించారు. ఆయా గ్రామాల ప్రతినిధులు ఒమ్మి సత్యనారాయణ, బలిజ ముసిలినాయుడు, సిదిరెడ్డి సూర్యనారాయణ, మళ్ల వెంకటరమణ, కోట్నీ రాజు తదితరులు కార్యక్రమానికి సహకారం అందించారు.

తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలి

కె.కోటపాడు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 7న మెగా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని ఎంఈవో డి.వి.డి. ప్రసాద్ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఆయన మాట్లాడారు.